క్లుప్తంగా

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి



మక్కువలో జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అర్జునరావు

మక్కువ: జీఎస్టీపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఎన్.అర్జున్ రావు కోరారు. ఈ మేరకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం మక్కువలో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానాన్ని తగ్గించిందని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. అనంతరం ప్రతి దుకాణానికి వెళ్లి జీఎస్టీ రేట్ల తగ్గింపు ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జయకుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ సింహాచలం, పంచాయతీ కార్యదర్శి విలాస్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన వైద్యులు



సమ్మె కారణంగా పాచిపెంట పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

పాచిపెంట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సోమవారం నుంచి సమ్మెలో ఉన్న నేపథ్యంలో పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విధులు బహిష్కరించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సిబ్బంది వైద్య సేవలు అందించారు. అత్యవసర కేసులకు మాత్రమే అందుబాటులో ఉంటామని వైద్యాధికారి రవిచంద్ర తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సూడిగాంలో కార్యకర్త చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం రూరల్: మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం మండలంలోని సూడిగాం గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్త దమలపాటి నారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. అలాగే వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు గొర్లి మాధవరావు తల్లి మాజీ కౌన్సిలర్ గొర్లి పార్వతి, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో జిల్లా కేంద్రాస్పత్రికి వెళ్లి జోగారావు పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సీతానగరం: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని మద్యం తాగి హహనాలు నడిపినా, హెల్మెట్‌లేకుండా వాహనాలు నడిపినా చట్టపర మైన చర్యలు తప్పవని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని హనుమాన్ జంక్షన్ వద్ద సోమవారం సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ పెదరావికోన గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. దసరా పండుగ నేపథ్యంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 18 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు దసరా రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఎస్.భాస్కరావు, టి.రమేష్, నీలకంఠం, వెంకటరావు, సుందరరావు తెలిపారు.

రుషింగి యువకుడికి డాక్టరేట్



శీలంకి గోవిందరావు

వంగర: మండల పరిధి రుషింగి గ్రామానికి చెందిన యువకుడు శీలంకి గోవిందరావుకు డాక్టరేట్ లభించింది. తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ పర్యవేక్షణలో శ్రీకాకుళం జిల్లా కవిత్వం-పరిశీలన అనే అంశంపై పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ఇటీవల 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడిగా కూడా ఎంపికయ్యారు.

ఆడబిడ్డ నిధి అందేనా?



బలిజిపేట: 2024సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ఆడబిడ్డ నిధి ఒకటి ప్రధానమైనది. దీని అమలుకు ఏడాదిన్నర సమయం చాలలేదా? అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. గతంలో డ్వాక్రా రుణాల హామీతో మోసం చేసి గత ఎన్నికల ముందు ఆడబిడ్డ నిధి పేరుతో ప్రచారం ఊదరగొట్టి మోసం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ అన్నారు, అది హిట్ చేశామన్నారు. అంటే ఇచ్చిన హామీలు పూర్తిచేసినట్లేనా అని మహిళలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే 18–59సంవత్సరాల మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని చంద్రబాబు, కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పథకం ఊసే లేదు. నమ్మి ఓట్లేసిన మహిళలకు మరోసారి మొండిచేయి చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాలని ఓ మంత్రి మాట్లాడిన దానిపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఇష్టానుసారం హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని మహిళలు విమర్శిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలకు పెద్దపీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించారని ప్రతి మహిళా చెప్పుకునే విషయం. అన్ని వర్గాల ప్రజలు ఏదో విధంగా లబ్ధి పొందేవారు. పార్టీలకు అతీతంగా, రాజకీయ ప్రమేయాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారు ఖాతాకు పథకం డబ్బులు జమ అయ్యేవి. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల సొమ్ము మహిళల ఖాతాల్లో జమ అయ్యాయి. కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర అయినా ఆడబిడ్డ నిధి అమలుకు నోచుకోలేదు. ఎప్పుడు అమలు చేస్తారో తెలియక మహిళలంతా అయోమయంలో ఉన్నారు.

- ఏడాదిన్నర కావస్తున్నా అమలుకాని హామీ

పథకంపై ఆశలేదు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంఘాలు అభివృద్ధి పథంలో నడవటం లేదు. పథకం అనడమే తప్పా అంతగా ప్రయోజనం లేని పథకాలే ఇవి. ఆడబిడ్డ నిధి పథకం అమలైనప్పుడు చెప్పుకుందాం.

– మహాలక్ష్మి, బలిజిపేట

వైఎస్సార్‌సీపీ హయాంలో మండలంలో సమకూరిన లబ్ధి

- ఆసరా పథకం కింద మొదటి విడత 1,314సంఘాలకు రూ.7.61కోట్లు
- రెండవ విడతలో 1,315సంఘాలకు రూ.8.20కోట్లు
- అమ్మ ఒడి పథకం కింద 18,450మంది మహిళలకు రూ.27,67,50,000
- చేయూత పథకం కింద 19,973మందికి రూ.37,44,93,750 చెల్లించారు.

మండలంలో 1,617సంఘాలు ఉన్నాయి. వాటిలో 17,360మంది మహిళలు ఉన్నారు. ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తే మండలంలోని మహిళలకు డబ్బులు అందే అవకాశాలున్నాయి.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

- గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రమీల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బి.ప్రమీల

పాచిపెంట: ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. యూరియా కొరతపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల వ్యవసాయాధికారిని నిలదీశారు. గిరిజన ప్రాంత రైతులకు యూరియా అందని ద్రాక్షగా మిగిలిందని వాపోయారు. కేరంగి పంచాయతీలో సుమారు 40 మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదని సర్పంచ్ సోము లచ్చయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. కారణాలు తెలుసుకుని డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో సతీష్‌ను ఎంపీపీ ఆదేశించారు. గిరిజన ప్రాంత రహదారులు అధ్వానంగా ఉన్నాయని వాటిని బాగు చేసే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను సభ్యులు కోరారు. అలాగే గత ప్రభుత్వంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్లు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం గిరిజన ప్రాంత ప్రజలకు తెలియడం లేదని, సచివాలయాలకు వెళ్లి తమ సమస్యలు చెప్పుకున్నా అక్కడ పట్టించుకునే పరిస్థితి లేదని, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ,గిరిజన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ ముందు వాపోయారు.

అర్హత, అనర్హత లిస్టులు వేలాడదీయాలి

ఈ విషయంపై ఎంపీపీ తీవ్రంగా స్పందిస్తూ, ప్రభుత్వాధికారులు ప్రజలు సమస్యలు సకాలంలో పరిష్కరించాలే తప్ప నిరంకుశంగా వ్యవహరించకూడదని హితవు పలికారు. అలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎలిజిబుల్, ఇనెలిజిబుల్ లిస్టులను గ్రామ సచివాలయాల వద్ద వేలాడదీయాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, ఎంపీడీవో బీబీజే పాత్రో, వైస్ ఎంపీపీ మీసాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



లక్ష్మీపురం నాయకులకు పార్టీకండువాలు వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు


- టీడీపీని వీడిన లక్ష్మీపురం నాయకులు

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పువ్వల రాము, పువ్వల అప్పారావులు కుటుంబసభ్యులతో సహా సోమవారం మాజీఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరినవారికి మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి గ్రామంలో పార్టీకోసం కృషి చేశామని, 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల్లో రెట్టించిన ఉత్సాహాన్నిచ్చే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు అధికారం చేపట్టిన తరువాత ప్రజల్ని గాలికి వదిలేశారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు కుమ్ములాటలతో సరిపోతోందని విమర్శించారు. ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా పేదలకు విద్యనందించడానికి శ్రద్ధచూపకపోవడంతో ఫీజులు కట్టలేక, పుస్తకాలు కొనలేక, పంటలకు గిట్టుబాటు ధరకల్పించక, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు.జగనన్న ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరామన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను చూడలేక, సంక్షేమ పథకాలు అందక పోవడంతో తిరిగి సొంత గూటికి చేరామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాయకత్వంలో తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు,జెడ్పీటీసీ మామాడి బాబ్జీ, మండల నాయకులు బంకురు శంకరరావు, వెంకటాపురం సర్పంచ్ బి.శ్రీనివాసరావు, వై.గోపాల నాయుడు, లక్ష్మీ పురం గ్రామ సీనియర్ కార్యకర్తలు సీహెచ్ ఉమామహేశ్వరరావు, తియ్యాల శ్రీనివాస్, కె.ధనుంజయ్ తరితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు



అజ్జాడలో అమ్మవారిని సరస్వతి దేవి అవతారంలో అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు



సీతానగరం: వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న సరస్వతీదేవి.



సరస్వతీ దేవిఅలంకరణలో దుర్గాదేవి



పాచిపెంట: సరస్వతిదేవిగా పారమ్మతల్లికి అలంకరణ

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో శ్రీ విజయదుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని సోమవారం సరస్వతి దేవి అవతారంలో అలంకరించి పూజలు చేశారు. అర్చకుడు బి.రామలింగస్వామి ఆధ్వర్యంలో మహిళలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

వాట్సాప్ గ్రూప్ నుంచి వైదొలగిన సచివాలయ ఉద్యోగులు



మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌కు నోటీసు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సాలూరు: సచివాలయ ఉద్యోగులు అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలిగారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌కు నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సచివాలయం ఉద్యోగులు జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం ఉదయం నుంచి అధికారిక లెఫ్ట్ అవమని ప్రకటన విడుదల చేయడంతో తాము వాట్సాప్ గ్రూపుల నుంచి లెఫ్ట్ అయినట్లు తెలిపారు. వలంటీర్లలా డోర్ టు డోర్ విధుల నుంచి తమను విముక్తులను చేయమని కోరామని అయినప్పటికీ ప్రభుత్వం నుంచి నేటికీ ఎటువంటి స్పందన లేకుండా పోయిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర జేఏసీ పిలుపుతో అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ అయ్యామని, ప్రభుత్వం ఎప్పుడైతే సానుకూలంగా స్పందిస్తుందో, అప్పుడు మాత్రమే తిరిగి అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో జాయిన్ అవుతామని స్పష్టం చేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న దృశ్యం

సాలూరు: సాలూరు పట్టణంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, కమిషనర్ రత్నాకర్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. అజెండాలో పేర్కొన్న అభివృద్ధి పనులను సభ్యులు ఆమోదించారు. మున్సిపాలిటీలోని సచివాలయాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని సభ్యులు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారని, అది ముగిసిన తరువాత దానిపై దృష్టిసారిస్తామని కమిషనర్ సమాధానమిచ్చారు. టౌన్‌ప్లానింగ్ అధికారి ఝాన్సీ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో రోడ్ల పక్కన ఆక్రమణలు జరుగుతున్నాయని వాటి నివారణకు అందరూ సహకరించాలని కోరారు. ఇదే సమయంలో పట్టణంలో మంత్రి సంధ్యారాణి తమ పార్టీ ఆఫీసు వద్ద వద్ద టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించడంతో సర్వసభ్య సమావేశం ఆఖరులో పలువురు టీడీపీ కౌన్సిలర్లు రావడం కనిపించింది.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

- వ్యవసాయశాఖ అధికారి అశోక్



సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఏఓ అశోక్

పార్వతీపురం రూరల్: ప్రజలకు, శాఖాపరంగా రైతులకు జవాబుదారీతనంగా వ్యవహరించడం అత్యంత కీలకంతోపాటు అధికారుల బాధ్యత అని ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి ఏ సమాచారం అయినా తెలుసుకునే హక్కును సమాచార హక్కుచట్టం పౌరులకు కల్పించిందని పార్వతీపురం మండల వ్యవసాయశాఖ అధికారి అశోక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో మండలంలో ఉన్న 21మంది గ్రామీణ వ్యవసాయశాఖ సహాయ సిబ్బందితో అవగాహన సదస్సు సమావేశం ఏర్పాటు చేసి చట్టంపై వారికి అవగాహన కల్పించారు. చట్టంలోని నిబంధనలు, అంశాలు వంటి విషయాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

పార్వతీపురం రూరల్:

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని, ముందుగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయానికి అంతా చేరుకోవాలని పలు అనుబంధ విభాగాల నాయకులు కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సర్పంచులు, ప్రజాప్రతినిధులు

పాచిపెంట: హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మించాలని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేలా గిరిజన ప్రజలు జలసమాధి కాకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే నాయకులు ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో శతాబి సర్పంచ్ శిల్పజన్ని రామయ్య, కేరంగి సర్పంచ్ సోముల లచ్చయ్య, తంగలం సర్పంచ్ అప్పన్న, గుమిడిగూడ సర్పంచ్ రామయ్య, ఎంపీటీసీలు డోనేరు లచ్చయ్య, చదల రాజు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు డిజిటల్ బుక్ శ్రీరామరక్ష



డిజిటల్ బుక్ జగనన్న 2.0 క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



డిజిటల్ బుక్ జగనన్న 2.0 క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్వతీపురం మండల నాయకులు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం సాగిస్తున్న కక్షసాధింపు చర్యలు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాడేందుకు డిజిటల్ బుక్ జగనన్న 2.0 ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు శ్రీరామరక్షగా నిలుస్తుందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నియోజక వర్గ స్థాయిలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు కావస్తున్నా అరాచక పాలనను కొనసాగిస్తూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించి కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులపై తీవ్రమైన అక్కసుతో అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇలాంటి అన్యాయాలను, వేధింపులను దాఖలు చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఈ డిజిటల్ బుక్‌ను ప్రారంభించారన్నారు. ఈ మేరకు ఫిర్యాదులను దాఖలు చేసే విధానాన్ని స్పష్టం చేశారు. అలాగే సోమవారం పార్వతీపురం పట్టణ, మండల నాయకులు కూడా డిజిటల్ బుక్ జగనన్న 2.0 పోస్టర్లను ఆవిష్కరించారు.

మా నాయకుడి జోలికివస్తే ఊరుకోం

దేవాలయం లాంటి అసెంబ్లీలో బాలకృష్ణ మతిస్థిమితం లేకుండా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని చిరంజీవి, జనసేన మంత్రి పవన్ కల్యాణ్‌తో విభేదాలు ఉంటే మీరు మీరు చూసుకోవాలని రాష్ట్రంలో ఎంతో ప్రజాదరణ కలిగిన తమ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డిని అన్యాయంగా దూషిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే జోగారావు ధ్వజమెత్తారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి, ప్రగతిపథంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రిపై శాసనసభ సాక్షిగా చేసిన అనుచిత వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు.

సూపర్‌సిక్స్ అట్టర్ ఫ్లాప్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కూటమి నాయకులు మేనిఫెస్టోలో చేర్చి ప్రజలను నమ్మించి ప్రస్తుతం అధికారంలోకి వచ్చి అమలు చేయడం చేతకాక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామంటూ కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులను యూరియా సైతం సక్రమంగా ఇవ్వకుండా రైతులను తీవ్రస్థాయిలో ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వంగా కూటమి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తల్లికి వందనం, దీపం పథకాలకు సంబంధించి లెక్కలను బయట పెట్టే ధైర్యం కూటమి ప్రభుత్వానికి ఉందా? అంటూ ప్రశ్నించారు. లక్షల మందికి సంక్షేమ పథకాలను అందనివ్వకుండా అవస్థలు పెడుతున్న కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామని కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, సర్పంచ్‌లు, వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నిందితులు నిర్దేశిత సమయానికి హాజరు కావాలి

- ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలో కుటుంబ తగాదాలు, భూముల తగాదాలతో కేసుల్లో ఉన్న 107మందికి ఇచ్చిన వాయిదాలకు నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో వివిధ తగాదాల్లో కేసులు పెట్టిన పోలీసులు 107 కేసులకు సంబంధించి వాయిదా లకు బుడ్డిపేట, పాపమ్మవలస తదితర గ్రామాలకు చెందిన నాలుగు గ్రూపుల వారిని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పదిరోజులుగా వివిధ వాయిదాలతో వస్తున్న నిందితులు నిర్దేశించిన సమయానికి హాజరు కాక పోవడంతో ముందుగా వచ్చిన వారు ఇబ్బందులకు గురికావవలసి వస్తోందన్నారు. మెజిస్ట్రేట్ కోర్టుకు సకాలంలో హాజరు కాని వారిపై కేసులు నమోదు చేసి జిల్లా కోర్టుకు నివేదించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి గురువారం వినతుల స్వీకరణ

గరుగుబిల్లి: గ్రామ సచివాలయాల్లో ప్రతి గురువారం ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ జి. పైడితల్లి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇకపై మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లకుండా.. గ్రామ సచివాలయాల్లో అర్జీలు సమర్పించవచ్చని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.